నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
13 హైదరాబాద్, ఆదివారం 28 జనవరి 2024 RANGAREDDY



బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో రంగులతో తీర్చిదిద్దిన అమ్మవారి చిత్రం

## మహా కుంభాభిషేక మహోత్సవాలు

అమీర్‌పేట్, జనవరి 27 : బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో అయిదు రోజుల పాటు జరుగనున్న శతచండి యాగ సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ వేద పండితులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వెంకటరమణ శర్మ, రామనాథ శర్మ, రాజీవదత్త తదితరులు శతచండీ యాగ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్ కోరారు.



మహా కుంభాభిషేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ వేద పండితులు

## ఎరువుల కొనుగోలు రసీదు తప్పకుండా ఇవ్వాలి



షాద్‌నగర్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి

షాద్‌నగర్‌టౌన్, జనవరి 27: ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులకు సూచించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపు ల్లో ఎరువు నిల్వ, రికార్డులను ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి డీలర్ రైతులకు ఆధార్‌కార్డు ఆధారిత వేలి ము ద్ర ద్వారా ఈ-పోస్ మెషిన్‌తో మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు. అవసరమైన ఎరువులను నిల్వ ఉంచుకోవాలన్నారు.



# మిల్లర్లలో.. టెన్షన్ టెన్షన్..

### ప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ ఇచ్చేందుకు బియ్యం లేకపోవడంతో మల్లగుల్లాలు

### సీఎంఆర్ రైస్ ఇవ్వడంలో రైస్ మిల్లర్లు ఆగమాగం

- ఎమ్మెల్యేల వద్దకు క్యూ కట్టిన రైస్ మిల్లర్లు
- ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించారని మిల్లర్లపై ఆరోపణలు
- ఈ నెలాఖరు వరకు లెవీ బియ్యం అందజేయాలని సర్కారు గడువు
- రెండేండ్లుగా క్లియర్ కాని సీఎంఆర్ రైస్
- మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం 78,834 మెట్రిక్ టన్నులు
- అధికంగా పెండింగ్‌లో గత వానకాలం, యాసంగి లోని సీఎంఆర్ బియ్యం



వికారాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని రైస్ మిల్లర్లలో టెన్షన్ మొదలైంది. సీఎంఆర్ బియ్యాన్ని ఈనెలాఖరు వరకు అందజేయాలని ప్రభుత్వం గడువు విధించడంతో రైస్ మిల్లర్లు ఆగమాగమవుతున్నారు. ప్రభుత్వానికి లెవీ బియ్యం అందజేసేందుకు మిల్లర్ల వద్ద బియ్యం లేకపోవడంతో ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. మరో నెల రోజులపాటు గడువు పొడిగించాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు. డిసెంబర్ 31 వరకే సీఎంఆర్ బియ్యం అందజేసేందుకు గడువిచ్చిన ప్రభుత్వం, మిల్లర్ల విజ్ఞప్తి మేరకు ఈ నెలాఖరు వరకు పొడిగించింది. అయితే ప్రభుత్వానికి అందజేసేందుకు లెవీ బియ్యం లేకపోవడంతో మరోనెల గడువు కోరుతుండడం గమనార్హం. కాగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుంచి లెవీ అందించేందుకుగాను రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని సరఫరా చేస్తుండగా.. మిల్లర్లు మాత్రం సర్కారు అందించే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తూ, నాసిరకం బియ్యాన్ని ఏడాది, ఏడాదిన్నర తర్వాత అందజేస్తూ వస్తున్నారు.

కొందరు రైస్ మిల్లర్లయితే మరీ రెండేండ్లు దాటినా సీఎంఆర్ బియ్యం తిరిగివ్వని పరిస్థితులున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి సరఫరా చేస్తున్న ధాన్యాన్ని బియ్యంగా మార్చి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 15 లకుపైగా విక్రయిస్తూ, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లెవీ బియ్యానికి సంబంధించి రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని రూ.10కి కిలో చొప్పున కొనుగోలు చేస్తూ లెవీ రూపంలో అందజేస్తూ రేషన్ డీలర్లు అక్రమంగా సంపాదిస్తున్నారు. ఈ మిల్లర్ల అక్రమ దందా జిల్లా పౌరసరఫరాల అధికారులకు తెలిసే జరుగుతున్నదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరులోగా లెవీ అందజేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించగా, సంబంధిత అధికారులు మాత్రం మిల్లర్లతోపా టు ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి గడువు పొడిగించాలని మద్దతు ఇస్తుండడం గమనార్హం.

**పెండింగ్‌లో 78,834 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి బియ్యం రూపంలో పౌరసరఫరాల శాఖకు విధించిన నిర్ణీత గడువులోగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఒకరిద్దరు మిల్లర్లు మినహా అందరూ.. పౌరసరఫరాల శాఖ మిల్లింగ్‌కు ఇచ్చిన ధాన్యాన్ని వెంటనే బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎలాంటి అనుమానం రాకుండా విడుత ల వారీగా పౌరసరఫరాల శాఖకు నాసిరకం బియ్యాన్ని అందజేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం ఈ నెలాఖరులోగా ఇవ్వాలని ఆదేశించడంతో మిల్లర్ల అక్రమ దందా వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. గత రెండేండ్లుగా తీసుకున్న ధాన్యానికి సంబంధించి ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం. 2020-21 వానకాలం నుంచి 2022-23 యాసంగి వరకు మిల్లర్లు తీసుకున్న ధాన్యానికి సంబంధించి తిరిగివ్వాల్సిన సీఎంఆర్ రైస్‌లో ఇంకా 78,834 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్, పెండింగ్‌లో ఉన్నది. 2021-22 వానకాలంలో 1,14,669 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు ఇవ్వగా, ఇప్పటికీ 136 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్, 2021-22 యాసంగిలో 82,597 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ఇవ్వగా ఇంకా 873 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్, 2022-23 వానకాలంలో 95,095 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు ఇవ్వగా, ఇంకా 24,200 సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. అదే విధంగా 2022-23 రబీలో 85225 మె ట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు ఇవ్వగా, ఇంకా 53,761 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ మిల్లర్లు ఇవ్వా ల్సి ఉన్నది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం ఇచ్చిన 15 రోజుల్లోగా సీఎంఆర్ రైస్ తిరిగివ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. గోదాం లు ఖాళీ లేక ఆలస్యమైందంటూ పౌరసరఫరాల అధికారులు చెబుతున్నప్పటికీ ఇదే అదునుగా మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సర్కార్ బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిల్లర్లు ధాన్యం సేకరించిన పదిహేను రోజుల్లో మిల్లింగ్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది కానీ రెండేండ్లు గడుస్తున్నా.. సం బంధిత అధికారులు పట్టించుకోకపోవడం కూడా మిల్లర్లతో సంబంధిత అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## తాండూరు అభివృద్ధికి రూ.100 కోట్లు

**దశల వారీగా ప్రత్యేక నిధులు.. టాటా కన్సల్టెంట్ సహకారంతో ఐటీఐ కళాశాల ప్రారంభం.. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తాండూరు అభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జనవరి 27 : రాష్ట్ర ప్రభుత్వం తాండూరు అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీ శాఖ మంత్రి సీతక్కను కలిసి అభివృద్ధి నిధులకు సంబంధించిన జీవో కాపీని అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఆర్‌ఆర్ కింద రూ.70 కోట్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.20 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద మరో రూ.10 కోట్ల నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారన్నారు. తాండూరు నియోజకవర్గం తరపున సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పాత పనులకు సంబంధించిన నిధులు రద్దు కావడంతో వెంటనే అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చామన్నారు. విద్య, వైద్యంతోపాటు రోడ్లు, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. తాండూరులో ఐటీఐ కళాశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి టాటా కన్సల్టెంట్ సహకారంతో ఐటీఐ కళాశాలను నడిపించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా తాండూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సహకరించండి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక..రాజకీయపార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో కలెక్టరేట్‌లో సమావేశం**



తహసీల్దార్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 27 : రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ శశాంక కోరారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించనున్న సందర్భంగా అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు అన్నింటికీ ఈ నెల చివరి వరకు సరిచేసి పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించామన్నారు. సమ్మర్ స్పెషల్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల చివరి వరకు పరిష్కరించి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూముల పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగాలి..**

కలెక్టరేట్‌లో శనివారం తహసీల్దార్లతోనూ కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ భూముల పర్యవేక్షణ నిరంతరాయంగా జరగాలని, కబ్జాదారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ ప్రభుత్వ భూములు గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తుది జాబితా రూపొందించుటకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి ఈనెలాఖరు వరకు పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించాలి

**ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు.. చదువుతున్న కాలేజీల్లో హాల్ టికెట్లను పొందాలి**

**జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్**

వికారాబాద్, జనవరి 27 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎన్. శంకర్‌నాయక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను ఆదేశించారు. శనివారం వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కార్యాలయంలో ఆయా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా జనరల్‌లో 35, ఒకేషనల్‌లో 13 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో 4,177 మంది సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం లో 1,352 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,259 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీ క్షలు జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు బ్యాచ్‌లు, సబ్జెక్టుల వారీగా రెండు సెషన్లలో నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు, ప్రాక్టికల్ టైమ్ టేబుల్‌ను వారు చదువుతున్న కళాశాలల ప్రిన్సిపాళ్ల దగ్గర నుంచి పొందొచ్చన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు కనీసం గంట ముందు కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

**కొత్తపేట గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్**

షాద్‌నగర్, జనవరి 27 : గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కేశంపేట మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. పల్లెల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని అభిప్రాయపడ్డారు. మారుమూల పల్లెలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తేనే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలను బాగు చేసుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉన్నదన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ, ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేశ్, జడ్పీటీసీ విశాల తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సమస్యపై సీఎం సీరియస్

**ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుల ఫోకస్**

**అన్ని ప్రభుత్వ విభాగాలతో నగర కొత్వాల్ సమావేశం**

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : మహానగరాన్ని పీడిస్తున్న ట్రాఫిక్ సమస్యపై సీఎం సీరియస్ అయ్యారు. దీంతో పోలీసు యంత్రాంగం ట్రాఫిక్‌పై ఫోకస్ పెట్టింది. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, హెచ్‌ఎండీఏ కమిషనర్ దాన కిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఇతర విభాగాల అధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, మెట్రో రైలు, జలమండలి, ఎలక్ట్రిసిటీ శాఖలకు చెందిన అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు అన్ని శాఖల అధికారుల సలహాలు, సూచనలతో ప్రత్యేక ప్రణాళికను రూపొందించేందుకు పోలీసు యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది.